# వెంకటరమణో నీకు పిల్లలున్నారా?

మంజుశ్రీ

"ప్రపంచంలో ఎన్నో విషాదాలుంటాయి. విలాసాలున్నాయి. మనకు సంబంధం లేని వాటి విషయంలోనూ మనం బాధపడిపోతూ ఉంటే ఈ ప్రపంచంలో బతకటమే కష్టమైపోతుంది."

నిజం చెప్పొద్దూ, మా రామచంద్రమూర్తి పదిరోజులు నాకు కనపడకపోతే వెర్రెత్తినట్లుంటుంది. ఇది ప్రేమంటారో, ఆకర్షణంటారో ఏమన్నా అనండి. మూర్తి నిండుమనిషి. నిబ్బరంగా వుంటాడు.

ఏదైనా సమస్యనో సందేహాన్నో ముందుంచితే ధైర్యంగా ఇట్లా చేస్తే బాగా వుంటుందని చెపుతాడు. ఆశకూ చైతన్యానికి సంకేతం మా మూర్తి.

మా మూర్తి ఈమధ్య కనిపించి పది రోజులైంది. నేనొక మూలా, వాడొక మూలా. ఇదేమో మహానగరం. మాకు కార్లూ, స్కూటర్లూ లేవు. ఫోన్లూ, వార్తాహరులూ మాట అనుకోడానికే లేదు ఒకేచోట రెండు కుటుంబాలుండగలిగే పెద్ద ఇళ్ళనూ భరించలేం. ఇక ఎట్లా! ఆర్నెల్లకో ఏడాదికో సకుటుంబంగా ఒకరింటికి ఒకరం వెళతాం. ఆ మాటా, ఈ మాటా కలబోసుకుంటాం. కలోగంజో తాగుతాం. జీవితంలో లభించే సంతృప్తినీ, సంతోషాన్నీ, ఉత్సాహాన్నీ అవాళ పంచుకుంటాం.

ఎందుకో మారేడ్‌పల్లి బస్ స్టాపులో నిలుచుని వున్నాడు మూర్తి మా చెల్లిని వాళ్ళింటికెళ్ళి చూసి కాసేపు కబుర్లాడి నేనూ అటువేపే వచ్చాను అప్పుడే.

"మూర్తీ" అని ప్రాణం లేచివచ్చినట్లు పిలిచాను.

నా దగ్గరకి వచ్చేశాడు. "ఎందు కిక్కడికి వచ్చావు?"

"అదంతా తర్వాత చెపుతాలే పద. కాస్త యెక్కడైనా కాఫీ తాగుదాం."

"నాక్కూడా కావల్సిందదే. ఒకచోట కూచుని పదినిముషాలు ఆ మాటా ఈ మాటా చెప్పుకోవచ్చు."

వాన వచ్చేలావుంది. వాతావరణంలో అంతా అదొక రకమైన ఆహ్లాదకరమైన చల్లదనం. దూరంగా పడమటి ఆకాశంలో మెరుపులు మెరుస్తున్నాయి. పొడుగాటి చెట్లు తలలూపుతున్నాయి. భూమిలోనుంచి సుతారంగా ఒక సువాసన వస్తోంది.

తొలకరి చినుకులకు నోరు తెరచి ఎదురు చూస్తున్నట్లు. ఇంతకుముందే చిన్న జల్లు పడినట్లుంది ఇంకా పెద్ద జల్లు కావాలని ఎదురు చూస్తోంది భూదేవి.

ఎందుకో గమనించలేదు. లేకపోతే తానే ముందుగా పరాచికాలాడేవాడు. ఛలోక్తులు విసిరేవాడు.

"ఏమిటిరా ఇన్నాళ తర్వాత కలుసుకుంటే ఈ హోటలు కీడ్చుకొచ్చావు"- అన్నాను నవ్వును అణచుకొంటూ కోపాన్ని అభినయిస్తూ. హోటల్లో ఇంకా ఇద్దరో ముగ్గురో మాత్రమే వున్నారు టేబిల్సు ముందు. అయ్యారుగారు విభూది దిట్టంగా తీర్చారు అగరువత్తులు వెలిగిస్తున్నారు గల్లా పెట్టెదగ్గర.

"ఇక్కడికి దగ్గరలో ఇంతకన్నా పెద్ద హోటలుగాని. మంచి హోటలుగాని లేదులేరా. ఏంవచ్చింది దీనికి లోటు" అన్నాడు మూర్తి. నేను వెయ్యదలచుకొన్న జోక్ గ్రహించలేదు.

"ఏం వచ్చిందంటావా? ఇదేం హోటలోయ్ అవాచ్యంగా. దండపాణి విలాస్ అట అంటే మనం టిక్కెట్టుచ్చుకోవల్సిందేగా—" అన్నాను నవ్వాపుకుంటూ.

మూర్తికూడా నవ్వాడు. "చాల్లేరా నా మనసిప్పుడు కులాసాగాలేదు. కోదండపాణి విలాస్‌లో 'కో' కాస్తా మాడిపోయింది. అయ్యారుకి చెప్పాలి. ఇట్లా అయితే ఎవరూ రారని. ఈ నియాన్ లైట్లతో యిదే ప్రమాదం" అని సన్నగా నవ్వాడుమూర్తి.

"తంజావూరులో కాదుకాదు తిరువాయూరులో యముడికి దేవాలయం వుందిలే. గుగ్గిలంపొగ వేస్తారు లోపలికి అడుగు పెట్టేముందు ఆ వూరివాడేమో అయ్యరుగారని."

"చలపతీ. నీ జోకు లిప్పుడు భరించలేనన్నానా? బుద్ధున్న వాడెవ్వడూ 'దండపాణి విలాస్' అని పెట్టుకుంటాడురా హోటలు పేరు!"

"అయ్యరుగారుతిరువాయూరువాడేనురా అడుగో గల్లా పెట్టెమీద తాళం వేసుకుంటూ ఏదో పాడుకొంటూ తన్మయత్వం అనుభవిస్తున్నాడు."

మూర్తి అటువేపు చూశాడు. "అయ్యరుగారూ ఒకసారి ఇటు వస్తారా?" అని పిలిచాడు.

అయ్యరుగారు ఉలిక్కిపడి వచ్చారు. "పొడుస్తారబ్బా కస్టమర్స్‌ని చూడనే చూడరు. యిదే ఏమివ్యాపారం" అంటూ.

"అది సరేకానండీ మీరు మీ బోర్డు మార్చకపోతే ఇక ఎవ్వరూ మీ హోటలు గడపన్నా తొక్కరు."

ఆయన కూడా గ్రహించాడు. రెండు స్ట్రాంగ్ కాఫీ కావాలంటంతో కదిలిపోయినాడు.

"ఇంతకూ ఏమిటిమూర్తీ నీఅస్వస్థత" అన్నాను

"నిజమేరా. నా మనస్సంతా చాలా అల్లకల్లోలంగా వుంది. ఇప్పుడు కొంచెం నయంగాని నాలుగు రోజులకింద చాలా బాధపడ్డాను."

"ఎందుకు? ఏం జరిగింది."


"చలపతీ. ఆవాళ నీవు కూడా వస్తే బావుండేది."

* * *

పదేళ్ళుంటాయా పిల్లకి. తల కోటి వేయించారు. ముఖం గుండ్రంగా వుంది- రెండు మూడు పళ్ళు వూడి మళ్ళీ రాలేదు లాగా వుంది. కళ్ళు ఎప్పుడూ ఆకాశం వేపే చూస్తున్నట్లుంటాయి. వెలిగుడ్లు కళ్ళలో అటూ, ఇటూ తిరగటమే లేదు. ఇంతలో నవ్వు. ఇంతలో ఏడుపు ఇంతలో మారాం. గునుపు ముద్దులు. గౌను లాగేసు కొని నోట్లో పెట్టుకుని నములటం. వెర్రి కేక లెయ్యడం. తల్లిని కావిలించుకొని మొహంలో మొహం పెట్టడం. తల్లి పెదవుల పై ముద్దు పెట్టుకుంటే నవ్వడం. ఎక్కడికో వెళ్ళిపోదాం రమ్మని గుంజులాట. మాటలు రావు. కీచు కీచుమని అరవటం. పదేళ్ళపిల్ల. ముద్ద బంతి పువ్వులావుంది. ఉండాల్సింది. పువ్వు బొడిపె దగ్గర ఏదో పురుగు చేరింది. ఆ రేకలు విప్పుకోవు. ఆ పువ్వు కలకలలాడదు. ఆ తొడిమ విరిగిపోయింది. ఆ తల్లినుంచి పోషణరాదు. చూసే వాళ్ళందరికీ దుఃఖ మనిపించింది. పాతిక ముప్పైమందిపైనే వున్నారు. ఆడవాళ్ళు. మగవాళ్ళు. పిన్నలూ. పాపలూ. రోగాల వాళ్ళు. నొప్పులవాళ్ళు. నేనూ వెళ్ళాను చలపతీ. కేవలం కుతూహలం.

ఇటువంటి మంత్ర తంత్రాలూ. పూజలూ. ఉపదేశాలూ. నమ్మదగినవేనా? నిజంగానే పనిచేస్తాయా? తెలుసుకోవాలని వెళ్ళాను. ఆయనేమో పెద్ద పోలీసాఫీసరు. రిటైరై పోయినారు. విభూది పెడతారుట. మంత్రిస్తారుట. గ్రహదోషాలు పోతాయట. జబ్బులు నయమవుతాయట. ఏం చేస్తారో చూదామని. నిజంగా రిలీఫ్ పొందిన వాళ్ళెవరైనా వుంటే చూదామనీ వెళ్ళాను. పదిరోజుల క్రితం చంద్ర గ్రహణం వచ్చింది చూడు. ఆ రోజు నాయన తెల్లవార్లూ హోమం చేస్తారంటే చూడటానికి వెళ్ళాను అదుగో అక్కడ తటస్థపడింది నా కాదృశ్యం.

ఆ తండ్రికి ముప్పైఅయిదో, ముప్పై ఆరో ఏళ్ళుంటాయి. ఆ తల్లికి ముప్పై ఏళ్ళుంటాయి. ఇద్దరూ ఒకరి కొకరు అమర్చినట్లున్నారు. అందంగా ఉన్నారు. ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. ఒకరి కోసం ఒకరు జీవిస్తున్నట్లున్నారు. కళ్ళ తోనే మాట్లాడుకుంటున్నారు. చూపులతోనే చెప్పుకుంటున్నారు. నీకు నేను లేనా అవి బెంచూపులతోనే ధైర్యంగా ఉన్నారు. వాళ్ళకో చిన్న బాబు పౌడరు డబ్బాలో పట్టు పువ్వు లాగున్నాడు. ముఖమంతా కళ్ళే. కళ్ళంతా నవ్వే. అక్కసంగతి తెలీదు. అక్క వుండుండి వాణ్ణి వెర్రి ముద్దు పెట్టుకుంటుంది. తల్లి కళ్ళలో నీళ్ళు తిరగబోయి వాళ్ళు. వీళ్ళు చూస్తే బావుండదేమోనని ఆగిపోతాయి.



ఆ పిల్లకేదో మెదడు జబ్బుట, ఆ తల్లి చెపుతోంది. చేయించకుండా వదిలిన వైద్యం లేదుట, అన్ని చికిత్సలూ చేయించారుట. చివరకి యోగానంద బాబుగారికి చూపమని ఎవరో సలహా చెప్పారుట. ఆర్నెల్లయిందట. కొంచెం గుణం కనపడుతున్నదట. ప్రతి బుధవారం వచ్చి విబూది పెట్టించుకొని పోతుంటారుట. మునుపటంత వెర్రిలేదు. పిలిస్తే పలుకుతుందట ఇప్పుడు తన వేపు చూస్తుందట. నవ్వుతుందట. అని చెపుతూ గట్టిగా ముద్దెట్టుకుంది తల్లి- రోజా నా రోజా, సరోజా అని గునుస్తోంది వెర్రి నవ్వు నవ్వుతోంది పదేళ్ళ పాప తల్లి మెడని కావిలించుకొని మూడేళ్ళ పిల్లలా గారాలు పోతోంది-

మూడింటికి పట్టుస్నానం చేయాలట. నాలుగుంబావుకి విడుపుస్నానమట. అప్పుడేవో ప్రక్రియలట. హోమానికన్ని సిద్ధమవుతున్నాయి. పూలూ, పళ్ళూ టెంకాయలు చిత్రపటంలో నిలువెత్తు వేంకటరమణమూర్తి విగ్రహం ఆయన నామం రత్నరేఖలా మెరిసిపోతోంది. పచ్చకప్పురంతో ఆయనకళ్ళు సగం మూసి వున్నాయి. ఎందుకు లోకాన్ని చూడటం ఇష్టంలేకనా ? ।

నాకు ఆ తల్లీదండ్రినీ ఆపాపనుచూస్తే ఎంతో దిగులనిపించింది. వీళ్ళు ఏం పాపం చేశారు ? ఇటువంటి ఘోరమైన శాపమా ? ఈ పాప ఎలా పెద్దది కావాలి ? ఎలా జీవితం సాగాలి. ఆ తల్లి తనభర్త. తన ఇల్లు తన సంసారం గురించి ఎన్నో కలలు కనివుంటుంది ! పెళ్ళి చూపులకు కూర్చున్నప్పుడు ఎన్నెన్నో ఊహించుకొని వుంటుంది: సంబంధం కుదిరిందని తల్లీ తండ్రీ సంబరపడిన నాడు పరవశించి వుంటుంది. పూలపల్లకి లోన పూలమాల నేను- అని కూనిరాగాలు తీసి వుంటుంది. పెళ్ళయి నీవు అత్తారింటికి వెళితే మాకేంతోస్తుందే చిట్టీ మా ఇల్లు బోపిపోతుంది కాబోలు-అని తల్లి అంటే కరుణతోనూ. గర్వంతోనూ తల్లి వేపుచూసి వుంటుంది. అన్నలకు ముద్దుచెల్లి అయి వుంటుంది. తమ్ములకు గారాల అక్క అయి వుంటుంది. వాళ్ళంతా ఎంత బాధపడుతున్నారో. చలపతి! ఒక సామెతవుంది. 'మాఘంలో పూసిన మల్లిదే అందం అన్నయ్యల వెనకపుట్టిన చెల్లిదే చందం' అవి. మరి యిలాటి సరోజా యెందుకు పుటింది ? ఈ లోకంలో కష్టాలకి. కన్నీళ్ళకి. రోగాలకు. రొప్పులకు. బాధలకు వేదనలకు. కోతకు. రోతకు. కారణాలేవిటి ? పిచ్చివాడి చేతి రాయిలాగా ఈ సృష్టి యెందుకు వుండాలి. ఇంతకన్నా సుఖంగా, శాంతంగా ఒక నియమానికి కట్టుబడి యెందుకుండకూడదు ? చలికాలంలో మల్లెపూలూ, ఎండాకాలంలో చామంతిపూలూ వుండనట్లు. మనిషి జీవితంలోకష్టాలూ, కన్నీళ్ళూవుండకూడదన్న సృష్టినియమం వుండకూడదా?

కంటిమీద కునుకులేదా తల్లికి. కాళ్ళ మీద చిన్నపిల్లను పడుకోబెట్టి నిద్రపుచ్చినట్లు సరోజను నిద్రపుచ్చింది. అలానే కూచుండిపోయింది గంటలతరబడి. ఎవరెవరో వస్తున్నారు. వాళ్ళ మొహాలకి. ఎదుర్రొమ్ముకి. పొట్టకి విబూదిరాస్తూ ఉఫ్ ఉఫ్ అని పెదాలు దాటిరాని ధ్వనులేవో చేస్తున్నారు బాబుగారు. కొబ్బరికాయ మంత్రించి ఇస్తున్నారు. బయటకు వెళ్ళి దూరంగా గోడకో, నేలకో విసరి కొట్టమంటున్నారు.

నన్నూ పిలిచారు నాకేం జబ్బు లేదన్నాను. అదే పెద్ద జబ్బనుకున్నారో ఏమో, నచ్చి ముఖాన విబూది పూశారు. విన్నే గ్రహమూ ఏం చెయ్యలేదు పొమ్మన్నారు. నే నాయనతో వాదించడం బాగుండదనీ అక్కడ చేరిన వాళ్ళంతా బాధపడతారేమోననీ మౌనంగా వుండిపోయాను. లేకపోతే ఈ గ్రహాలూ, ఆగ్రహాలూ నేను నమ్మనని చెపుదామని వుంది. అర్ధరాత్రి వేళ ఎందరో కార్ల మీద వచ్చారు. వాళ్ళంతా ఏవేవో తప్పుడు పనులు చేయకపోతే ఈ బాధలెందుకు చుట్టుకుంటాయి. డబ్బుండి. పెద్ద ఇళ్ళుండికార్లుండి నౌకర్లూ, చాకర్లూవుండి. గడచి గట్టెక్కలేని రోగాలతో ఎందుకు బాధపడతారు మనుషులు ! దేవుడా అని ఎందుకు ఆక్రోశిస్తారు ! మనశ్శాంతిని ఎందుకుపోగొట్టుకుంటారు. అటూ, ఇటూ ఎందుకు పరుగులుతీస్తారు. వీటన్నిటికి కారణం ఏమిటి ? ఆ తల్లీ, తండ్రీ రాత్రి వేళ మూడుగంటలు గడచిన తర్వాత చెరొకరూ, చెరొక బిడ్డనూ జబ్బాన వేసుకొని నిర్మానుష్యమైన వీధిల్లో రిక్షానో, టాక్సీనో కనపడుతుందేమోనని వెతుకుతుంటే నా గుండె పగిలిపోయింది. నా కడుపు తరుక్కుపోయింది. నేను చూసిన దృశ్యం ఇదొక్కటే. ఇలాటివి ఎన్నెన్నో ఈ లోకంలో.

* * *

'ఎక్కడేవిటి ఆ యోగానందంగారిల్లు' అని అడిగాను

"గాంధీనగర్‌లో గాని, నువ్వు కూడా ఓ సారి వెళ్ళి చూస్తావా ?"

"నువ్వే ఎప్పుడైనా తీసుకెళతానంటే వస్తాను," అన్నాను.

రేపే బయటి నేమ్ బోర్డు మార్పించి వేస్తాను అని హామీ ఇచ్చారు అయ్యరు గారు.

సికింద్రాబాద్ స్టేషన్ దాకా ఇద్దరం నడుచుకుంటూ వచ్చాం. పెహిదీపట్నం



తూర్పు కడుపు చీల్చుకొస్తున్న తుహిన కిరణం ఫొటో : శ్రీనగేష్, తెనాలి

వెళ్ళేబస్సెక్కి వెళ్ళిపోయాడురామచంద్ర మూర్తి నేను చిక్కడపల్లి బస్సెక్కాను.

స్టేషనంతా కోలాహలంగావుంది. విద్యుద్దీపాల కాంతితో అందంగా వుంది. స్టేషన్‌లో గడియారం ఏడుగంటలు చూపిస్తున్నది. అంతకుముందే ఒక జల్లుపడి వెలిసి నట్లున్నది. వాతావరణం చల్లగా వుంది

మా బస్సు బయలుదేరింది. రామచంద్రమూర్తి టాంక్‌బండ్ దాటి వుండవచ్చు. ప్రపంచంలో ఎన్నో విషాదాలుంటాయి. విలాసాలున్నాయి. మనకు సంబంధం లేనివాటి విషయంలోనూ మనం బాధపడిపోతూవుంటే ఈ ప్రపంచంలో బతకడమే కష్టమైపోతుంది. బతుకు మీదే ఆసక్తి హరించుకొని పోతుంది. రుచి లేకుండా పోతుంది. ఉత్సాహమే లేకుండాపోతుంది. విండో లోంచి బయట రోడ్డు మీదకు చూస్తున్నాను. వీధులన్నీ సమ్మర్దంగా వున్నాయి. ఎక్కడ చూసినా ఏదో ఒక రూపంలో వెంకటరమణుడే- బార్బర్ షాపునుంచి మిఠాయి అంగళ్ళ వరకూ, వైన్ షాపుల నుంచి సినిమా హాళ్ళవరకు. బట్టలకొట్లనుంచి శీతల పానీయాల కుటీరాలవరకు తానూ తన నామం. తనకెన్నో పేర్లు. ఒక వీధిలో లెక్కపెడితే అన్నిటికన్నా యెక్కువ సంఖ్యలో అతగాడి పేర్లే కనపడతాయి. అతగాడి రూపమే యెక్కడ చూసినా కనపడుతుంది.

ఇంతలో నాకొక సంగతి జ్ఞాపకం వచ్చింది. మూడేళ్ళయిం దనుకుంటాను. తూర్పు తిరుపతిలో స్టేషనుదిగి స్టేషన్ లోంచి బయటకు రాగానే ఎవరో భక్త బృందం జట్టుగా చేరి దీపపు స్తెమ్మ్మను మధ్యనుంచి చెక్కభజన చేస్తున్నారు. రంగుబట్ట కట్టగానే. హంగుబొట్టు పెట్టగానే. నీకు తత్త్వం తెలిసేనా, సత్యం దొరికేనా అని భావం. పదం అందుకొని కలిసి పాడుతున్నారు.

అది ఒక పెద్ద నది. జనప్రవాహం. సత్యమేమిటో, తత్వమేమిటో!

కుంటి బిచ్చగాడి సాయంతో గుడ్డి బిచ్చగాడు బస్సులో ఎక్కి పాడుతున్నాడు. 'మహేశా పాపవిలాసా నిన్ను నమ్మినాను దేవా,నీలకంతరా'. అయ్యో అయ్యో పాపవిలాసా కాదురా, పాపవినాశా అనిరా అని అరిచి చెప్పాలని చాలా బాధపడ్డాను. కాని మళ్ళీ అదే ధోరణి. అదే పాట. అదే చరణం. పదేపదే నా మనసులో అదేబాధ.

ఈ సారి కొండపైన నాలుగు రోజులైనా వుండాలి. నాకు కూడా ఏదైనా నిదర్శనం దొరుకుతుందేమో చూడాలి! ఎదురు చూడని వాళ్ళు వచ్చి ఆదుకుంటారేమో! లేకపోతే ఇంత జనసందోహమా?

ఇంత తాపత్రయమా? ఇన్ని పడిగాడ్పులా! ఇంత చిత్తవిభ్రమమా? ఇంత వైభోగమా?

ఆ రాత్రి పవళింపుసేవ చేస్తారంటే ఎలా వుంటుందో ఆ కైంకర్యం అని చూడటానికి వెళ్ళాను. ఆ మధ్యాహ్నం కళ్యాణోత్సవం చూశాను.

సేవపూర్తిఅయిన తర్వాత తలుపులు వేసేశారు.

అమ్మవారు పాద సంవాహనం చేస్తూ వుండవచ్చు.

'ఆదిన్ శ్రీసతి కొప్పుపై తనువుపై అంసోత్తరీయంబుపై పాదాబ్జంబులపై కపోల తటిపై' తండ్రి చెయ్యి ప్రేమమీర ప్రసరిస్తూ వుండవచ్చు. ఆ తల్లి సిగ్గుపడుతూ 'పోండి ఎప్పుడూ కొత్తపెళ్ళికొడుకువేనా' అంటూ వుండవచ్చు.

ఎన్నో వేళల ఆరగింపులు.
ఎన్నో వేడుకలు. ఎంతో శృంగారం.
అంగరంగ వైభోగం.
పట్టుపానుపులు, పడకటింట్లు.
అన్నీ బాగానే ఉన్నాయి. కాని-

వేంకటరమణా నీకు పిల్లలున్నారా—
ఉంటే పరోజ సంగతి తెలిసేది.
సరోజ తల్లీ తండ్రీ సంగతి తెలిసేది.
చిక్కడపల్లి వచ్చినట్లుంది. నేను దిగాల్సిన స్టాప్ వచ్చేసింది.



